సాక్షి కర్నూలు
ఆదివారం ꠲ 31 ꠲ డిసెంబర్ ꠲ 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం విశాఖపట్నం కు చెందిన జి.కస్తూరి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



ధనుర్మాస పూజలు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం ఉడిపి శ్రీకృష్ణ క్షేత్రంలో శనివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. రాములోరి తీర్థ ప్రసాదాలను స్వామిజీ విద్యాసాగర తీర్థులకు అందజేశారు.



క్షణికావేశం మృత్యుపాశమై

క్షణికావేశంలో ఇద్దరు బిడ్డలను తల్లి నిర్దాక్షిణ్యంగా హతమార్చింది. తను కూడా ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషాద ఘటన హొళ్వి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

ఐదుగురికి కరోనా పాజిటివ్



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మరో ఐదుగురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మెడికల్ ఓపీ, ఎఫ్ఎంసీ, పీడియాట్రిక్ వార్డులలో కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఓర్వకల్లులో ముగ్గురు, లొద్దిపల్లి గ్రామంలో ఒకరు, కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఒకరికి కోవిడ్ పాజిటివ్ ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో కోవిడ్ బాధితుల సంఖ్య 13కు చేరింది.

జగనన్నకు చెబుదాం-స్పందన రద్దు

కర్నూలు(సెంట్రల్): ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించే జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని ఈ వారం రద్దుచేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం జనవరి 1 కావడంతో రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

'పది' రివిజన్ టెస్ట్‌లు ప్రారంభం



పూడూరు హైస్కూల్‌లో రివిజన్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: పదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి రివిజన్ టెస్టులు ప్రారంభం అయ్యాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన హైస్కూల్స్ 506 ఉండగా ఇందులో 41,008 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరందరికీ రివిజన్ టెస్టులు నిర్వహించేందుకు తయారు చేసిన ప్రశ్నపత్రాలను ఆయా హైస్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులకు చేరవేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల వరకు మొత్తం నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహించనున్నారు. అలాగే వెనుకబడిన విద్యార్థుల గుర్తించి, ఆయా సబ్జెక్టు టీచర్లతో రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నారు.

ఐలు కేంద్ర కమిటీ సభ్యుడిగా కెంగార కుమార్



కర్నూలు(లీగల్): జాతీయ స్థాయిలో న్యాయ వ్యవస్థ పరిరక్షణ, న్యాయవాదుల సమస్యలపై పనిచేసే ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) కేంద్ర కమిటీ సభ్యుడిగా కర్నూలుకు చెందిన కెంగార కుమార్ ఎన్నికయ్యారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నగరంలో ఈనెల 28, 29, 30 తేదీలలో 14వ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలో కెంగార కుమార్‌ను కేంద్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తిలో ఉన్న కెంగార కుమార్ ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కోశాధికారిగా ఉన్నారు. మూడోసారి కేంద్ర కమిటీలోకి కెంగార కుమార్ ఎన్నికవడం పట్ల జిల్లాలోని పలువురు అడ్వకేట్లు హర్షం వ్యక్తం చేశారు.

ధర్మకర్తల మండలి సమావేశం వాయిదా

మహానంది: మహానంది దేవస్థానం కార్యాలయంలో శనివారం జరగాల్సిన ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం వాయిదా వేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తదుపరి సమావేశం తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. మహానంది దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై పరిశీలించి చర్చించే కార్యక్రమంలో భాగంగా మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.



జన జాతర

జనవరి 8: ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి జాతర వైభవంగా ప్రారంభమైంది. ఆ రోజు నిర్వహించిన రథోత్సవానికి వేలాదిగా ప్రజలు తరలి వచ్చి స్వామి దర్శించుకున్నారు. జిల్లాలో జరిగే జాతరల్లో ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి మొదటి కావడం విశేషం. జిల్లా నలుమూలల నుంచి ఆశేషంగా ప్రజలు తిరునాలకు వచ్చారు.



'సినీ' సందడి

ఫిబ్రవరి 10: కర్నూలులో ప్రముఖ హీరో రామ్‌చరణ్ సినిమా షూటింగ్ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమా షూటింగ్‌లు నిర్వహించాలని షరతు పెట్టింది. దీంతో తరచూ సినిమా షూటింగ్‌లు, వేడుకలు కర్నూలులో జరిగాయి.



'ఫ్యాన్' ప్రభంజనం

మార్చి 16: స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ బి.మధుసూదన్ గెలుపొందారు. ఆయన ఆదోని ప్రాంతానికి చెందిన బోయ సామాజిక వర్గానికి చెందిన నేత. బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి డాక్టర్ బి.మధుసూదన్‌ను గెలిపించారు.



తొలి మహిళా జిల్లా కలెక్టర్

ఏప్రిల్ 10: కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ జి.సృజన, జేసీగా నారపురెడ్డి మౌర్య బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లాకు తొలిసారి మహిళా కలెక్టర్‌గా డాక్టర్ జి.సృజన వచ్చారు. ఏప్రిల్ 12వ తేదీన కర్నూలు జిల్లా ఎస్పీగా జి.కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టారు.



ఆరోగ్య భాగ్యం

మే 04: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.20 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఆరోగ్యశాఖమంత్రి విడదల రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా నిర్మించిన ఓపీ విభాగాన్ని కూడా ప్రారంభించారు.

ప్రజలందరికీ భద్రత



జూలై 26: డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీస్ బాస్ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి మొదటిసారిగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. శాంతి భద్రతలపై పోలీస్ అధికారులతో సమీక్షించారు.

కొలువుల కల సాకారం



ఆగస్టు 25: పోలీసు శాఖలో ఎస్ఐ కొలువుల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో రేంజ్ పరిధిలోని అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.

సస్యశ్యామలం



సెప్టెంబర్ 19: జిల్లా పశ్చిమ ప్రాంతంలోని పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో 77 చెరువులకు హంద్రీనీవా నుంచి నీళ్లిచ్చే కార్యక్రమాన్ని సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి కృష్ణగిరి మండలం కటారు కొండ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఇంత వరకు సాగునీటి వసతిలేని డోన్ నియోజకవర్గానికి తొలిసారి హంద్రీనీవా ద్వారా నీళ్లు ఇచ్చారు.



అన్నదాతకు 'భరోసా'

జూన్ 1: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండలో పర్యటించారు. వైఎస్సార్ రైతు భరోసా నిధులను అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. జూలై 8వ తేదీన పంటలు నష్టపోయిన రైతులకు బీమాను వర్తింపజేస్తామని ప్రకటించారు.

కాలం చెక్కిలిపై సంక్షేమ సంతకం

- ప్రతి గడపకూ అందిన సంక్షేమ పథకాలు
- చేరువైన పాలనతో ప్రజలంతా సంతోషం
- జిల్లాలో పరుగులు పెట్టిన అభివృద్ధి
- 2023కు వీడ్కోలు పలుకుతూ.. నూతన ఏడాదికి స్వాగతం



కాలం ఆట్టే ఉండదు.. పాత జ్ఞాపకాలను మోసుకుంటూ, కొంగొత్త ఆశలను చుట్టుకుంటూ ప్రవహిస్తూ ఉంటుంది. నూతన ఏడాది 2024 కూడా కోటి కాంతులు, సరికొత్త ఆకాంక్షలతో వస్తోంది. కాలం చెక్కిలిపై సం'క్షేమ' ముద్ర వేసుకుని 2023 వీడ్కోలు పలుకుతోంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతో 2023లో ప్రజలంతా సంతోషంగా గడిపారు. అర్హతే ప్రామాణికంగా, ఎవరి సిఫార్సులు లేకుండా ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు అందాయి. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకే వచ్చి చేరాయి. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు పరుగు పెట్టాయి. విద్య, వైద్య రంగాలు సరికొత్త వన్నెలు అద్దుకున్నాయి. ప్రభుత్వ శాఖల్లో పోస్టుల భర్తీతో నిరుద్యోగుల కల నెరవేరింది. ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో హంద్రీ-నీవా నీటితో చెరువులను నింపడంతో కరువులోనూ అన్నదాతలు బంగారు పంటలు పండించారు. వివిధ ప్రభుత్వ పథకాలను ప్రారంభించేందుకు జిల్లాకు వచ్చిన ప్రతిసారి ఇక్కడి ప్రజలకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో 2023లో ప్రధాన రాజకీయ పార్టీల కార్యక్రమాలు ఊపందుకున్నాయి. అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 'వై నీడ్స్ ఏపీ జగన్, ఇంటింటికీ జగనన్న, సామాజిక సాధికార యాత్రలతో' ప్రజల్లోకి దూసుకెళ్లింది. నాయకత్వ లోపంతో ప్రతిపక్ష టీడీపీ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టలేకపోయింది. టీడీపీ నేత నారాలోకేష్ చేపట్టిన పాద్రయాత్రకు ప్రజల నుంచి మద్దతు లభించలేదు. 'స్కిల్ స్కామ్' కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాలలో అరెస్టు అయ్యారు. దీంతో ఆ పార్టీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. జిల్లాకు కొత్తగా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఎస్పీగా జి.కృష్ణకాంత్, జేసీగా నారపురెడ్డి మౌర్య వచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో వీరు తమదైన ముద్రను వేసుకున్నారు. 2023లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచి ఆకట్టుకున్నారు. సంక్రాంతి, శివరాత్రి, రంజాన్, దసరా, దీపావళి, క్రిస్మస్ వేడుకలు వెలుగులీనాయి. ప్రభుత్వం అందించే పథకాలతో ఆర్థిక కష్టాలు తొలగి ప్రజల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. గతేడాది జ్ఞాపకాల సమాహారం సచిత్రంగా..

– కర్నూలు(సెంట్రల్)

అవినీతి మరక



సెప్టెంబర్ 9: నంద్యాలలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని స్కిల్ స్కామ్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడి నుంచి ఆయన్ను రోడ్డు మార్గాన విజయవాడకు తీసుకెళ్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

'గృహ' భాగ్యం



అక్టోబర్ 12: జగనన్న కాలనీల్లో పూర్తయిన 17 వేల ఇళ్లలోకి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'భూ'మంతా సంబరం



నవంబర్ 17: జిల్లాలో దాదాపు 8 వేల మందికి భూ హక్కుపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కొందరికి భూములు ఇవ్వగా, మరి కొందరికి తీసుకున్న అసైన్‌మెంట్ భూములు 20 ఏళ్లు దాటి ఉంటే నిషేధిత జాబితా నుంచి తొలగించారు.



కరువు రైతుకు ఉపశమనం

డిసెంబర్13: జిల్లాలోని కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించింది. రైతులను ఆదుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పింది.



'సామాజిక' చైతన్యం

డిసెంబర్17: కర్నూలులో, డిసెంబర్ 22న ఎమ్మిగనూరులో, అక్టోబర్‌లో పత్తికొండలో వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సు యాత్రలు జరిగాయి. ఈ యాత్రలకు విశేష స్పందన లభించింది.

బీసీ హాస్టళ్లలో కొత్తగా మెనూ యాప్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ బీసీ వసతిగృహాల్లో కొత్తగా మెనూ యాప్‌ను అమల్లోకి తీసుకొస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శనివారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని బీసీ వసతి గృహ సంక్షేమాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పారదర్శకత కోసం నూతన యాప్‌ను అమలు చేస్తున్నామన్నారు. యాప్‌లోని కెమెరా ఆధారంగా విద్యార్థులకు అందించే మెనూ ఫొటోలు హాస్టల్ లోకేషన్‌లోనే తీయాలన్నారు. బ్రేక్‌ఫాస్ట్ ఫొటోలను ఉదయం 6 నుంచి 9 గంటల్లోపు, మధ్యాహ్నం లంచ్‌ను 11 నుంచి 2 గంటల్లోపు, రాత్రి డిన్నర్‌ను సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల్లోపు అందించాలన్నారు. ఈ సమయంలో అందించిన మెనూ ఫొటోలను మాత్రమే క్యాప్చర్ అవుతాయన్నారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఆయా వసతి గృహాల్లోని ట్యూటర్లకు రోజుకో ప్రశ్నపత్రం అందించి విద్యార్థులచే పరీక్ష రాయించిన అనంతరం మార్కులను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ట్రైనీ డీబీసీడబ్ల్యూఈఓ భరత్‌కుమార్‌రెడ్డి, సహాయ బీసీ సంక్షేమాధికారులు లక్ష్మినారాయణ, నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



యాప్ వివరాలు తెలుపుతున్న డీబీసీడబ్ల్యూఓ వెంకటలక్షుమ్మ

బహిరంగ మార్కెట్ ధరతో కందుల కొనుగోళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) బహిరంగ మార్కెట్ ధరతో కందుల కొనుగోలు చేపట్టనుంది. నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లకు డీసీఎంఎస్ రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.10 వేల పైనే పలుకుతోంది. ఈ కారణంగా మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అవసరం లేకుండా పోయింది. అయితే భవిష్యత్ అవసరాల దృష్ట్యా నాఫెడ్ ప్రస్తుత మార్కెట్ ధరతోనే కందులను కొనుగోలు చేస్తోంది. నాఫెడ్‌కు డీసీఎంఎస్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్‌కు 17 బ్రాంచీలు ఉన్నాయి. వీటన్నింటిలో కందులను కొనుగోలు చేయనున్నారు. ఉదాహరణకు.. సోమవారం రోజు కందులు కొనుగోలు చేయాలంటే ఆదివారం సాయంత్రానికే ధర వస్తుంది. నాణ్యత ప్రమాణాలను బట్టి రోజంతా ఈ ధర ప్రకారమే కొనుగోలు చేస్తామని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ బిజినెస్ మేనేజర్ రాజేష్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తామని.. విక్రయించిన వారం రోజుల్లో నగదు నాఫెడ్ నుంచి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందన్నారు. వివరాలకు 92912 08958, 93810 85983 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

భార్య కాపురానికి రాలేదని..


బుక్య రాము నాయక్ (ఫైల్)

పాములపాడు: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాడాల గ్రామానికి చెందిన బుక్య రామునాయక్(29) ఆరేళ్ల క్రితం వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన కల్యాణిబాయిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. కొన్నేళ్ల క్రితం దంపతుల మధ్య కలహాలతో కల్యాణిబాయి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన రాము నాయక్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి 108లో ఆత్మకూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆసుపత్రికి చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కోటయ్యనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

శివాలయం జీర్ణోద్ధరణకు రూ. 1.25 కోట్లు


గ్రామస్తులతో ఏఎస్పీ రాజేశ్వరరెడ్డి

డోన్ టౌన్: వెంకటాపురం గ్రామంలో పురాతన శివాలయం జీర్ణోదర్ధరణకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన నెల్లూరు జిల్లా విజిలెన్స్ శాఖ ఏఎస్పీ కల్లూరు రాజేశ్వరరెడ్డి తన వంతుగా రూ.25 లక్షలు ప్రభుత్వానికి చెల్లించడంతో దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి రూ. కోటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆలయ అభివృద్ధిపై శనివారం రాజేశ్వరరెడ్డి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన స్థల సేకరణపై చర్చించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు మధుసూదనరెడ్డి, రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న పెద్దయ్య, చంద్రన్న, నాగన్న, పాపయ్య, చిట్యాల నాగరాజు, కేశన్న, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మరింత 'పవర్' ఫుల్

- రూ.385.24 కోట్లతో నూతన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎమ్మిగనూరు, గడివేముల, చాగలమర్రి మండలాల్లో నిర్మాణం
- నిర్మాణాలకు గత నెలలో వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్


కర్నూలు జిల్లాలోని 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అత్యధిక సామర్థ్యం కలిగిన సబ్‌స్టేషన్లను నిర్మిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకేసారి రికార్డు స్థాయిలో రూ.385 కోట్లతో మూడు సబ్ స్టేషన్‌లను నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణాలకు నవంబరు 22న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన కూడా చేశారు. నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణం, కొత్త లైన్ల ఏర్పాటుతో 15 మండలాలకు సంబంధించి లక్షలాది మంది వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందనుంది. అలాగే వ్యవసాయ రంగానికి పగటిపూటనే 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందుతుంది. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. లో వోల్టేజి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విద్యుత్ సరఫరా నష్టాలు, అంతరాయం తగ్గుతుంది. విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సబ్ స్టేషన్‌లు నిర్మిస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

బనవాసిలో రూ.148 కోట్లతో నిర్మాణం

ఎమ్మిగనూరు మండలం బనవాసి ప్రాంతం పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ రూ.148 కోట్లతో 220/132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం మండలాలకు చెందిన రెండు లక్షల మంది వినియోగదారులకు ఎన్నో రకాలుగా మేలు జరగనుంది.

ముత్యాలపాడులో రూ. 138.59 కోట్లతో..

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో రూ.138.59 కోట్లతో 220/131/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయితే చాగలమర్రి, దువ్వూరు, చాపాడు, రుద్రవరం, శిరివెళ్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలకు సంబంధించి విద్యుత్ లో వోల్టేజీ సమస్యలు పరిష్కారం అవుతాయి. అంతేగాక ఈ ప్రాంతం పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముత్యాలపాడులో నిర్మించే సబ్‌స్టేషన్‌తో ఆళ్లగడ్డ, రుద్రవరం ఉపకేంద్రాలపై అధిక లోడ్ తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది.

గడివేములలో రూ.98.65 కోట్లతో..

నంద్యాల జిల్లా గడివేముల ప్రాంతంలో 2220/132/33 కేవీ సబ్ స్టేషన్ లేదు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతో పాటు గృహ అవసరాలకు సంబంధించి ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.98.65 కోట్లతో 2220/132/33 కేవీ సబ్ స్టేషన్‌ను గడివేముల మండలం కొర్రపోలూరు గ్రామంలో నిర్మిస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే గడివేముల, వెలుగోడు, మిడుతూరు, బండిఆత్మకూరు, గడిగరేవుల, గని, రోళ్లపాడు, సంతజూటూరు, వేల్పనూరు, దుర్వేశి, ఈర్నపాడు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దాదాపు 2 లక్షల మంది వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందనున్నాయి. నంద్యాల విద్యుత్ ఉప కేంద్రం పైనున్న అధిక లోడు ప్రభావం తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది.

నేటి రాత్రి ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

బొమ్మలసత్రం: పోలీసులు డిసెంబర్ 31వ తేదీ రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించనున్నారని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మైనర్లను తల్లిదండ్రులు రాత్రి 10 గంటల తర్వాత ఇంటి నుంచి బైటికి పంపవద్దని సూచించారు. వేడుకల పేరుతో మైనర్లు బైక్‌లపై తిరిగితే తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. వేడుకల పేరుతో బాణాసంచా, డీజేలతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధిక శబ్దం చేసే బైక్‌లపై విచ్చలవిడిగా యువకులు తిరిగితే ఆ బైక్‌లను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. నేషనల్ హైవేపై బైక్ రేసులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రహదారుల మధ్యలో కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేయవద్దని, ఇళ్లలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. యువత మద్యం మత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆస్తులు ధ్వంసం చేస్తే వారిపై కేసులు నమోదు చేసి ఆ సంస్థలకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉరుకుందకు 'డిప్యూటీ' హోదా

- దేవస్థానానికి డిప్యూటీ కమిషన్ హోదా కల్పిస్తూ జీవో


ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం

మంత్రాలయం: దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం స్థాయి పెరిగింది. ఈ క్షేత్రానికి డిప్యూటీ కమిషనర్ హోదా కల్పిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆలయం 1973లో దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. అప్పటి నుంచి పాలక మండలి వ్యవస్థ ఏర్పాటైంది. ఇప్పటి వరకు 9 పర్యాయాలు పాలక మండలి ఏర్పడింది. కార్యనిర్వాహణ అధికారి హోదాలో 1997 వరకు ఆలయ పాలన సాగింది. క్షేత్రం దినదినాభివృద్ధి చెందడంతోపాటు ఆదాయం పెరగడంతో 1997లో అసిస్టెంట్ కమిషనర్ హోదా కల్పించారు. స్వామి దర్శనానికి భక్తులు వేలాది తరలి వస్తుండటంతో జిల్లాలో ప్రముఖ క్షేత్రంగా ఉరుకుంద విరాజిల్లుతోంది. ఏటా కోట్లాది రూపాయల్లో ఆదాయం వస్తోంది. ఈ నేపథ్యంలో క్షేత్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



భక్తుల ఆదరణతో ఉరుకుంద క్షేత్రం ఆదాయం పెరిగింది. ప్రభుత్వం, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఆలయానికి రాజగోపురాలు, మహా ప్రాకారం నిర్మించాం. బండపరుపు, క్యూలైన్లు ఏర్పాటు చేశాం. ఆదాయ రీత్యా శుక్రవారం ఆలయ హోదాను ప్రభుత్వం పెంచింది. అందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

– కె.వాణి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్

క్షణికావేశం మృత్యుపాశమై

- ఇద్దరు బిడ్డలను హతమార్చిన తల్లి
- అనంతరం ఆత్మహత్యాయత్నం
- హాల్విలో విషాదం



వెంకటేష్ (ఫైల్), భరత్ (ఫైల్)

మంత్రాలయం/కౌతాళం : వచ్చీరాని మాటలతో అమ్మా.. అమ్మా అంటూ పిలిచే మూడేళ్ల బాలుడు ఒకడు.. ఉంగా.. ఉంగా అంటూ తల్లి పొత్తిళ్లలో వెచ్చగా సేదతీరే ఆరు నెలల బాలుడు ఇంకొకడు.. ఆకలేసి వీరు అల్లాడుతుంటే కన్నీరు కార్చే తల్లి.. వారు లేకుండా కొన్ని నిమిషాలు కూడా ఉండలేని మాతృమూర్తి.. బిడ్డలే భవిష్యత్తుగా బతుకుతున్న అమ్మ.. ఏం కష్టమొచ్చిందో.. మనసుకు ఎక్కడ గాయం అయ్యిందో.. హృదయం ఎక్కడ ముక్కలైందో.. క్షణికావేశంలో ఇద్దరు కన్న బిడ్డలను నిర్దాక్షిణ్యంగా హతమార్చింది. తను కూడా ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషాద ఘటన కౌతాళం మండలం హాల్వి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హాల్వి గ్రామానికి చెందిన బోయ రామకృష్ణకు కోసిగి మండల అర్లబండకు చెందిన శారదతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే వీరికి కుమారులు వెంకటేష్ (3 ఏళ్లు), భరత్ (6 నెలల) ఉన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న శారద ఐదు నెలలుగా పుట్టింటిలో ఉంటోంది. గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టాపన ఉండటంతో ఇటీవల హాల్వి గ్రామానికి వచ్చింది. ఆపరేషన్ చేసుకున్న భార్య పనులు చేయడం భావ్యం కాదని భర్త యోచించి.. పుట్టింటిలో వదిలి వస్తానని శుక్రవారం రాత్రి చెప్పాడు. శనివారం ఉదయం లేచి పొలానికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి నిద్రిస్తుండగా.. చిన్న పిల్లవాడు భరత్ అరుపులు వినిపించాయి. ఇంటి బయటకు వెళ్లి చూడగా భార్య శారద నీటి బకెట్లో పిల్లాడిని ముంచుతూ కనిపించింది. అప్రమత్తమై బాలుడిని చికిత్స నిమిత్తం గ్రామంలోని వైద్యుని దగ్గరికి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. అనుమానం వచ్చిన రామకృష్ణ సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా పెద్ద పిల్లాడు వెంకటేష్ నోటి నుంచి నురుగు రావడంతో హుటాహుటిన వైద్యుని వద్దకు తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పెద్ద కుమారుడికి వెంట్రుకలకు రాసే వ్యాస్‌మోల్ తాపి తాను కూడా తాగి శారద అపస్మారకస్థితికి వెళ్లింది. ఆమెను ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకుంటోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


ఆదోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శారద

తహసీల్దార్లకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ


ల్యాప్‌టాప్‌లు అందుకున్న తహసీల్దార్లలో జిల్లా కలెక్టర్ శామూన్, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తహసీల్దార్లు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వారి సేవలు మరింత విస్తృత పరిచేందుకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారుల సమీక్ష అనంతరం అన్ని మండలాల తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్యలు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల నూతన జిల్లాగా ఏర్పాటైనప్పటి నుంచి వసతులు, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ తహసీల్దార్లు ప్రజలకు సర్వీసులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులను నిర్ణీతకాల పరిమితిలోగా పూర్తి చేయడంతో పాటు ప్రముఖుల పర్యటనలకు అత్యవసర సేవలు అందించడంలో కూడా రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తహసీల్దార్లు మరిన్ని సేవలు ప్రజలు మెచ్చే రీతిలో అందించేందుకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశామన్నారు.

జిల్లాకు నాలుగు నంది అవార్డులు


మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య.


నాటక దర్శకులు రమణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాల్లో జిల్లాలోని కళా సమాజాలకు నాలుగు నంది అవార్డులు లభించాయి. శనివారం టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' పద్య నాటకానికి రెండు విభాగాల్లో నంది అవార్డులు వచ్చాయన్నారు. లైటింగ్ విభాగంలో డాక్టర్ సురభి నిరుపమకు, ఆహార్యంలో సి. శ్రీనివాసులుకు నంది పురస్కారాలు వచ్చాయన్నారు. పల్లేటి కులశేఖర్ రచనలో తాను దర్శకత్వం వహించిన నాటకం జనాదరణ పొందిందన్నారు. ప్రేక్షకాదరణ పొందిన తమ నాటకానికి అవార్డులు రాకపోవడంతో నంది అవార్డులను తిరస్కరించామన్నారు. సమావేశంలో కళా సమితి సభ్యులు లక్ష్మీకాంతరావు, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

- కర్నూలు కళా కారుల సంక్షేమ సంఘం వారి 'ఆనందనిలయం' నాటకానికి రెండు నంది అవార్డులు వచ్చాయని నాటక దర్శకులు వి.వి. రమణారెడ్డి పేర్కొన్నారు. నటుడు భాస్కర్‌కు ఉత్తమ సహాయ నటుడు విభాగంలో ఒక నంది, సెట్టింగ్ విభాగంలో సురభి సంతోష్‌కు ఒక నంది అవార్డు వచ్చిందని తెలిపారు. పల్లేటి కులశేఖర్ నాటకాన్ని రచించారని పేర్కొన్నారు.

సాధారణ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు

- ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓల సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, హాజరైన ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌లు, నోడల్ అధికారులు

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుది ఓటరు జాబితా ప్రచురణకు పది రోజుల ముందు పూర్తిగా సంబంధిత ఓటర్ల ఫొటో ఉందా లేదా, ఇతరుల ఫొటో ఉందా అనే విషయాలను నిశితంగా పరిశీలించాలన్నారు. పెండింగ్ ఫారం 6, 7, 8లను త్వరగా పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. వికలాంగులు ఎవరి సాయం లేకుండా నేరుగా కేంద్రంలోకి వెళ్లేలా ర్యాంపులు, వీల్‌చైర్లను ఏర్పాటు చేయాలన్నారు. జనవరి 2 నాటికీ ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతుల కల్పనపై జనవరి 5 నాటికి నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నాడు–నేడు పనులను ఫిబ్రవరి 15 లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు తప్పనిసరిగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉండాలని సూచించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందికి సంబంధించి ఉద్యోగుల వివరాలను సేకరించాలని మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 సంవత్సరాలు పైబడిన వారితో పాటు 60 శాతానికి పైగా శారీరక వికలత్వం ఉన్న వారు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా వివరాలు సేకరించాలన్నారు. ఇందు కోసం ఒక్క మైక్రో అబ్జర్వర్‌తోపాటు, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లను నియమించాలన్నారు. ఈవీఎంలపై ఓటు వేసే విధానంపై కొత్త ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అదనపు ఎస్పీ టి.సర్కార్, డీఆర్వో కె.మధుసూదన్ రావు, ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మీ పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- మద్యం మత్తులో స్నేహితుడి ఘాతుకం
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు


హత్యకు గురైన అస్లాం (ఫైల్)

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో దారుణం చోటు చేసుకుంది. మద్యం మత్తులో స్నేహితుడే ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాగమర్రి భవానీ నగర్‌కు చెందిన కారు డ్రైవర్ అస్లాం (22), గొండ సుభహాన్, పెయింటర్ సాధిక్ స్నేహితులు. సాధిక్ తల్లి చనిపోగా, తండ్రి పీర్‌బాషా కువైట్‌లో ఉంటున్నాడు. సుభహాన్ తల్లి చనిపోగా ఇతడు తండ్రితో కలిసి ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. సాదిక్ ఇంట్లో ఒక్కడే ఉండటంతో తరచూ స్నేహితులు అతని ఇంట్లోనే మద్యం సేవిస్తూండేవారు. ఈ క్రమంలో ఏమి జరిగిందో తెలియదు కాని.. అస్లాంను హత్య చేశానంటూ సుభహాన్ శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో పోలీసులకు విషయం చెప్పి లొంగిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమణయ్య వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శనివారం ఉదయం ఆళ్లగడ్డ సీఐ హనుమంతనాయక్ చాగలమర్రికి చేరుకుని అస్లాం మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. కాగా హత్యకు కారణాలుపోలీసులు వెల్లడించడం లేదు.

పథకం ప్రకారమే హత్య?

కారు డ్రైవర్ అస్లాంను పథకం ప్రకారమే హత్య చేసినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని పరిశీలించగా అస్లాం రక్తం మడుగులో పడిపోయి ఉన్నాడు. కత్తితో గొంతు కోయడంతో పాటు గుండె భాగంలో నాలుగైదుసార్లు పొడిచిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. హత్య చేశానని చెబుతున్న సుభహాన్, హతుడు అస్లాం దగ్గరి బంధువులు. కాగా హత్య జరిగిన రోజు సాధిక్ ఇంట్లో కొత్త వ్యక్తులు ముగ్గురు మద్యం సేవించినట్లు సమాచారం. హత్య జరిగిన సమయంలో తను ఇంట్లోలేనని, బంధువుల ఇంటిలో భోజనం చేయడానికి వెళ్లానని సాధిక్ చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.